సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం | 28 | జనవరి | 2024

I



నకిలీ పోలీసు అరెస్టు

రాజంపేట పట్టణంలో శనివారం బద్వేలుకు చెందిన మాడపూరు శివయ్య అనే నకిలీ కానిస్టేబుల్‌ను పట్టణ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. -IIలో



సబ్సిడీతో ముగ్గురాయి

మంగంపేట ముగ్గురాయి ఆధారిత పరిశ్రమల మిల్లర్ల యజమానులకు సబ్సిడీతోనే ముగ్గురాయి అందిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 166 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	375	512
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1900.420 కిలోలు

న్యూస్‌రీల్

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రాయచోటి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, పాలిక్లినికల్ లేబరేటరీలు, కంటి,దంతవైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపి క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎన్. కొండయ్య ఒకప్రకటనలో తెలిపారు. పైన పేర్కొన్న సంస్థలన్ని ఏపీ మెడికల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. జనవరి 31వ తేదీలోపు ఆన్‌లైన్ పోర్టల్‌లోనమోదు చేసుకోవాలన్నారు. గడువులోపు వివరాలను నమోదుచేయని సంస్థలపై చర్యలు తీసుకుంటాయని ఆయన హెచ్చరించారు.

విద్యతోనే ఉజ్వల భవిత



లైబ్రరీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జికలెక్టర్ ఫర్మాన్‌ఖాన్, చిత్రంలో జెడ్పీటీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్): విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని జిల్లా ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. శనివారం వీరబల్లె మండలం వంగిమళ్ల గ్రామంలోని ఉప్పరపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన దాత చిట్లూరి కిరణ్‌కుమార్ దాతృత్వంతో సుమారు రూ.2లక్షల విలువ చేసే లైబ్రరీని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ విద్యకోసం సీఎం వైఎస్ జగన్ ఎంతో ఖర్చుచేస్తున్నారని తెలిపారు. నాడు - నేడు పథకంతో పాఠశాల రూపు రేఖలు మార్చారని చెప్పారు. దాత చిట్లూరి కిరణ్ కుమార్, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, రాజంపేట వైఎస్సార్ సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డి (మదన్ రెడ్డి), ఎంపీడీవో మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

30న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: తమ కార్యాలయంలో ఈనెల 30వ తేది ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంకు, ఎల్‌ఐసీ, బైజూస్ కంపెనీలు ఇంటర్వ్యూలు రానున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 10–37 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పురాతన చర్చి సందర్శన

కలసపాడు: స్థానిక సగిలేరు ఒడ్డున ఉన్న పురాతన చర్చి పరిపేతురు పరిపోలు చర్చిని శనివారం అమెరికా దేశస్తులు ఎలిజబెత్‌బ్రౌన్, డేవిడ్‌లీసె, థామస్, పెట్రిసియా, డైనోల్ఫోలు సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి విశిష్టత గురించి విచారణ గురువులు వారికి వివరించారు. కార్యక్రమంలో రెవ. సంజయ్ మధు, రెవ. అబ్రహం‌ప్రేమ్‌చంద్, కె.జె.ప్రవీణ్ (చిన్ను), చిత్తారాజశేఖర్‌రెడ్డి, ప్రభావతి, శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

కడప రూరల్: ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు కడప పాత రిమ్స్‌లో గల వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా, లేదా ఎంఎల్‌హెచ్‌పీఆర్‌ఈసీటీ ఆట్‌ది రేటాఫ్ జీమెయిల్.కం వెబ్ సైట్ ద్వారా తెలుపవచ్చని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన ఫైనల్ మెరిట్, ప్రొవిజనల్ సెలక్షన్ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ జాబితాపై 9వ తేదీలోపు అభ్యంతరాలను తెలపవచ్చన్నారు. 12న ఫైనల్‌గా అభ్యర్థిల ఎంపిక జాబితాను ప్రకటించి, 14న నియామక కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని చెప్పారు.

ఆమె ఓటే..శాసనం

- జిల్లాలో 14,02,808 మంది ఓటర్లు
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళల హవా
- గతంతో పోలిస్తే జిల్లాలో పెరిగిన ఓటర్లు



రాజంపేట: వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకైనా..అభ్యర్థికైనా మహిళ ఓటర్ల మద్దతు కీలకంగా మారనుంది. ఓటు వేసే వారి సంఖ్య తేలింది. తుది జాబితాను విడుదల చేసిన క్రమంలో జిల్లాలో 14,02,808 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళాఓటర్లు 7,13,326, పురుషుల ఓటర్లు 689346, ఇతరులు 135 మంది ఉన్నారు.



- జిల్లాలో రాజంపేట, రాయచోటి, కోడూరు,తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ సెగ్మెంట్లలో మహిళా ఓటర్ల హవా కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ఈ సారి మహిళా ఓటర్లు ఘననీయంగా పెరిగారు.వీరు అభ్యర్థుల తలరాతను మార్చనున్నారు.
- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫారం7, 8లలో తెలియచేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6లో దరఖాస్తు సమర్పించుకోవచ్చు. దీంతో తుది ఓటర్ల జాబితాలో తమ ఓటు ఉందా లేదా అని పరిశీలన చేసుకుంటున్నారు.

నియోజకవర్గాల సంఖ్యలివే..

రాష్ట్ర ఎన్నికల సంఘం నియోజవర్గాలకు సంఖ్యను నిర్ణయించింది. రాజంపేట 125, కోడూరు 127, రాయచోటి 128, తంబళ్లపల్లె 162, పీలేరు 163, మదనపల్లె 164.

సర్వీసు ఓటర్లలో పురుషులదే పైచేయి..

జిల్లాలో సర్వీసు ఓటర్లలో పురుషులదే పై చేయిగా ఉంది. రాజంపేటలో 158 మంది పురుషులు ఉంటే, 5 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. కోడూరులో 112 మంది పురుషులు ఉండగా, నలుగురు మహిళా ఓటర్లు ఉన్నారు. రాయచోటిలో 253 మంది పురుష ఓటర్లు ఉండగా, కేవలం ఒక మహిళా ఓటరు ఉన్నారు. తంబళ్లపల్లెలోవ 175 పురుష ఓటర్లు ఉండగా, 1 మహిళ ఓటరు ఉన్నారు. పీలేరులో 396 మంది పురుష ఓటర్లు ఉండగా, ఆరు గురు మహిళా ఓటర్లు ఉన్నారు. మదనపల్లెలో 168 పురుష ఓటర్లు ఉండగా, ఏడుగురు మహిళా ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గాలవారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం
రాజంపేట	121424	115594	10	237028
కోడూరు(ఎస్సీ)	102176	99351	17	201544
రాయచోటి	126512	123836	26	250374
తంబళ్లపల్లె	112418	109219	10	221647
పీలేరు	118397	114022	16	232435
మదనపల్లె	132399	127324	57	259780



మహిళ అభ్యున్నతికి జగనన్న కృషి



రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారు. మహిళల రక్షణకు దిశయాప్‌ను తీసుకొచ్చారు. రాబోయే ఎన్నికల్లో సీఎంకు మహిళలు వెనుదున్నగా నిలవాలి. మళ్లీ జగనన్న సీఎం కావాలని మహిళాలోకం ఎదురుచూస్తోంది. –గడికోట ఉషాసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ, నందలూరు

అందుబాటులో ఓటర్ల జాబితా



ప్రజలకు అందుబాటులో ఓటర్ల జాబితా ఉంచాం. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు ఉందో లేదో చూసుకోవచ్చు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 7, 8లలో దరఖాస్తు చేయవచ్చు. ఇప్పటి వరకు అర్హత ఉండి, కొత్తగా ఓటు నమోదు చేసుకోని వారు, జాబితాలో పేరు కనిపించని వారికి ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోంది. ఫారం–6 దరఖాస్తు స్వీకరిస్తారు. –ఫర్మాన్ అహ్మమద్‌ఖాన్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

నగరవనాన్ని అందంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: రాయచోటి పట్టణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నిర్మించిన నగరవనాన్ని రాబోయే కాలంలో అందంగా తీర్చిదిద్దుతామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణ సమీప పరిధిలో ఉన్న కంచాలమ్మ గండి చెరువుపై నిర్మించిన నగరవనంలో మాండవ్య ఎకో పార్కును గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లాలో ఫారెస్టు, ఐసీఐసీఐ, ప్రజల సహకారంతో నగరవనాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. జిల్లా ప్రజల భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని దాదాపు 76 ఎకరాల్లో అన్ని హంగులతో, మూడుకోట్ల రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగరవనానికి దగ్గరలో ఉన్న కంచాలమ్మ గుడి చెరువులో బోటింగ్ ఏర్పాటు, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు, రాశివనం, నక్షత్ర వనాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో నగరవరనం త్వరితగతిన అభివృద్ధి జరగడం గర్వించదగ్గ విషయమన్నారు. రాబోయే రోజుల్లో నగరవనం రూపురేఖలు మార్చేందుకు ప్రజలు, దాతలు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎండీ ఏపీఎఫ్‌డీసీ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజుద్ బాష, అడిషనల్ ఎసీసీఎఫ్ డీకే సింగ్, సిసిఎఫ్ నాగేశ్వరరావు, ఐసిఐసిఐ డెవలప్మెంట్ ఆఫీసర్ రాజేశ్వరీ, మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, కమ్యునిటీ ఫెసిలిటేటర్ అనూష, డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ నాగమనీశ్వరీ, ఫారెస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి: ఇన్‌చార్జి కలెక్టర్

సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సిబ్బందికి సూచించారు. శనివారం రాయచోటి మండలం, గోర్లముదివీడు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. సచివాలయం పరిధిలో ఎంతమంది గర్భిణులు ఉన్నారు.. ఎంతమంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలుసుకున్నారు. వారికి ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం అందేలా చూడాలని సంబంధిత ఏఎన్ఎంకు సూచించారు. అనంతరం సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, వైఎసార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, రైతు భరోసా తదితర పథకాలకు సంబందించిన అర్హుల, అనర్హుల జాబితాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన నగరవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

నేటి నుంచి కబడ్డీ సమరం



ఉత్సాహంగా క్రీడాప్రాంగణానికి చేరుకుంటున్న క్రీడాకారులు

- పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం
- వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన క్రీడాకారులు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఆదివారం నుంచి ఎస్‌జీఎఫ్ అండర్–14 67వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే పోటీల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు శనివారం రైలుమార్గం ద్వారా వారి ప్రాంతాల నుంచి రాజంపేటకు చేరుకున్నారు. క్రీడాకారులకు, మేనేజర్లకు, కోచ్‌లకు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. క్రీడా మైదానం ప్రాంగణంలో అధికారులు క్రీడాకారల బరువు నిబంధనల మేరకు ఉందా లేదా అని సరిచూసి నిబంధనల మేరకు బరువు ఉన్న వారికి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పించారు.

నాలుగు కోర్టులు ఏర్పాటు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల సందర్భంగా రోజుకు 20 మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఇందుకోసం మ్యాట్‌లతో కూడిన నాలుగు కోర్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో పోటీలను నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. క్రీడాభిమానులు నాలుగు కోర్టుల్లో జరిగే ఏ మ్యాచ్‌నైనా వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులు తరలి వచ్చారు. తమ అర్హతకు సంబంధించిన పరిశీలన పూర్తిచేసుకున్న తరువాత వారి కోచ్‌లు, మేనేజర్లతో కలిసి పట్టణంలో కలియ తిరిగారు. దీంతో ఎటుచూసినా క్రీడాకారుల కోలాహం నెలకొంది. జాతీయ స్థాయి క్రీడాపోటీలను విజయవంతం చేసేందుకు రాష్ట్రస్థాయి క్రీడా అధికారులు వందమందికి పైగా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

కాగడా చేతపట్టి ర్యాలీలో పాల్గొన్న ఆకేపాటి



ర్యాలీలో పాల్గొన్న ఆకేపాటి, పోలా

రాజంపేటలో జాతీయ స్థాయి క్రీడాపోటీలు జరిగే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు శనివారం సాయంత్రం వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆకేపాటి విలేకరులతో మాట్లాడారు. రాజంపేటలో జాతీయ స్థాయి పోటీలు జరగడం ఈ ప్రాంత వాసులకే కాక జిల్లా ప్రజలందరికి గర్వకారణమన్నారు. ర్యాలీని పురస్కరించుకొని విద్యార్థులు డ్రమ్స్ వాయిస్తూ ముందుకు సాగారు. దారివెంబడి పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వసంతి, రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల విద్యాశాఖ అధికారులు కొండూరు రఘునాథరాజు, నాగయ్య, జి.చక్రధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న విభేదాలు

- చినిగిన రా...కదిలిరా కార్యక్రమం ఫ్లెక్సీలు
- రాయచోటి తెలుగుతమ్ముళ్ల మధ్య తెరపైకి వచ్చిన వివాదం

సాక్షి ప్రతినిధి, కడప: రాయచోటి టీడీపీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. అన్నమయ్య జిల్లా పీలేరులో శనివారం టీడీపీ అధినేత రా.. కదలిరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం వేదికగా తెలుగుతమ్ముళ్ల మధ్య వివాదం తెరపైకి వచ్చింది. రాయచోటి నుంచి పీలేరు వరకు హైవే రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన సుగవాసీ బాలసుబ్రమణ్యం ఫ్లెక్సీలను టార్గెట్ చేశారు. రాజంపేట పార్లమెంట్ సీటు ఆశిస్తున్న బాలసుబ్రమణ్యం ఫొటో మాత్రమే ఫ్లెక్సీలో కన్పించకుండా గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. ఫ్లెక్సీల వివాదం రాయచోటి నియోజవకర్గంలో ఇప్పుడు హాట్ టాఫిక్ అయింది.

పీలేరులో టీడీపీ అధినేత చంద్రబాబు ఏర్పాటు చేసిన రా..కదిలిరా కార్యక్రమం రాయచోటి తెలుగుతమ్ముళ్లకు బలప్రదర్శనకు వేదిక అయింది. రాయచోటి నుంచి పీలేరు వరకు దారి వెంబడి ఆయా టీడీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న సుగవాసి బాలసుబ్రమణ్యం ఫ్లెక్సీలను ఏ ఒక్కటి వదలకుండా గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. టీడీపీ నేతలు ద్వారకనాథ రెడ్డి, రమేష్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి ఫ్లెక్సీలుండగా, బాలసుబ్రమణ్యం ఫ్లెక్సీలు మాత్రమే టార్గెట్ చేశారు. ఎందుకు ఇలా చోటుచేసుకుందని సుగవాసీ బ్రదర్స్ డైలమాలో పడ్డారు. తమ ఫ్లెక్సీలు మాత్రమే చించేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని చర్చించుకుంటున్నారు. టీడీపీలో తమ ఎదుగుదలను జీర్ణించుకోలని స్థితిలో కొంతమంది ఉన్నారనే అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. 2012 నుంచి ఇలాంటి పరిస్థితి టీడీపీలో కొనసాగుతోందని చర్చించుకుంటున్నారు.



అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం మోటకట్ల సమీపంలో చించేసిన ఫ్లెక్సీ

పార్లమెంటు అభ్యర్థిగా తెరపైకి....

గత కొంతకాలంగా టీడీపీలో సీనియర్ నేత పాలకొండ్రాయుడు తనయుడు ప్రసాద్‌బాబు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నా, బాలసుబ్రమణ్యం స్తబ్దతగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో ఇటీవల రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిత్వం ఆశిస్తూ అన్యూహ్యంగా తెరపైకి వచ్చారు. ఆమేరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిచయ కార్యక్రమాలను కూడా వేగవంతం చేశారు. ఒక్కమారుగా సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీలో ఫోకస్ అవుతూ వచ్చారు. ఈనేపథ్యంలో రాయచోటి శివార్ల నుంచి పీలేరు వరకు కేవలం బాలసుబ్రమణ్యం ఫ్లెక్సీలు మాత్రమే చినిగిపోవడం వెనుక అభ్యర్థిత్వం ఆశిస్తున్న సహచర నేతల దుశ్చర్యగా పరిశీలకులు భావిస్తున్నారు.

జిల్లాలో చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలి

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లాకు, రాయచోటికి చేసిన అభివృద్ధి ఏంటో చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు ధైర్యంగా చెప్పాలని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రాయచోటిలో శనివారం సాయంత్రం పీలేరులో చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. మహానేత వైఎస్‌ఆర్ హయాంలో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అందించిన సంక్షేమాలు, చేసిన అభివృద్ధిని ఘంటాపథంగా చెబుతామన్నారు. తాను ఎమ్మెల్యేగా రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య హయాంలో రాయచోటిలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించానన్నారు. ముఖ్యమంత్రిని ఇళ్లకు పిలిపించుకొన్న నాయకులు, 8 సంవత్సరాలు చేతిలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని సాధించిన అభివృద్ధి ఏంటో చూపించాలంటూ స్థానిక టీడీపీ నాయకులకు చురకలు అంటించారు.సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థ, ఊరూరా నిర్మించిన సచివాలయాల ద్వారా ప్రజలకు జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చెబుతామని చెప్పారు. మీరేమి చేశారో చెప్పలేని స్థితిలో ఉండి.. నేడు జిల్లా కేంద్రం మారుస్తామంటూ చెబుతున్న మీకు ఓటు వేయాలా? అంటూ నిలదీశారు. జిల్లా కేంద్రాన్ని ఇప్పటికే చాలా అభివృద్ధి చేశామని తిరిగి ప్రజల అభిమానంతో ఎమ్మెల్యేగా గెలుపొంది రింగ్‌రోడ్డును, నాలుగు లైన్ల రోడ్డుగా మారుస్తామన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, పరిశ్రమలు తీసుకువస్తానని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పేదవాళ్లకు ఇళ్ల కట్టించిస్తామన్న ధైర్యం మీకుందా? అని ప్రశ్నించారు. మహానేత వైఎస్‌ఆర్, తర్వాత మేము పేద ప్రజలకు కాలనీలు కట్టిచ్చామని అన్నారు. ప్రభుత్వ భూములు కేటాయించింది భవిష్యత్‌తరాల కోసమే తప్ప నా కోసం కాదని టీడీపీ నాయకుల విమర్శకులకు సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ భూములను తాను ఆక్రమించినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. దమ్ము ఉంటే అభివృద్ధిపై చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాల్ చేశారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి ఏమీ చేయలేని చంద్రబాబు జిల్లా కేంద్రం తెచ్చి హాస్పిటల్, బస్టాండ్, మునిసిపల్ కార్యాలయం సభా భవనం, బస్టాండ్, డీఎస్పీ ఆఫీస్, స్టేట్ గెస్ట్ హౌస్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగరవనం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన మాపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మిల్లర్లకు సబ్సిడీతో ముగ్గురాయి అందిస్తాం

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



మంగంపేట మిల్లర్ల యజమానులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట ముగ్గురాయి ఆధారిత పరిశ్రమల మిల్లర్ల యజమానులకు సబ్సిడీతోనే ముగ్గురాయి అందిస్తామని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి మిల్లును కాపాడుకుని ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగంపేట మిల్లర్ల యజమానులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగంపేట సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. అందుకు అనుగుణంగానే ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తున్నారన్నారు. మంగంపేట స్థానికులు, గ్రామస్తులకు తగిన విధంగా న్యాయం చేశారని ఆయన పేర్కొన్నారు. దీనికితోడు నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే పరిశ్రమలు ఏర్పాటు చేసిన మిల్లర్లకు కూడా న్యాయం చేసేందుకు కొత్త జీఓ విడుదల చేశారన్నారు. దీని ద్వారా ప్రతి ఒక్కరికి ఏపీఎండీసీ ఎగుమతులతో పాటు ముగ్గురాయిని 10 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంగంపేట ప్రజలకు, మిల్లర్లకు న్యాయం చేశారన్నారు. ఆ తర్వాత టీడీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు మంగంపేట గనులను సర్వనాశనం చేశారన్నారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఇక్కడి ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. దీంతో 20వేల మంది నిరుద్యోగులకు, వేలాది మంది కార్మికులకు , వందలాది మంది మిల్లర్లకు న్యాయం చేకూరి జీవనోపాధి లభిస్తుందని వివరించారు. మంగంపేట మిల్లర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు ఎంతో కృషిచేశారన్నారు. వారికి రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పోతల లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, రాఘవరెడ్డి, సిద్దారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.9లక్షల నగదు సీజ్

ముద్దనూరు : స్థానిక పోలీసులు శనివారం సాయంత్రం సుమారు రూ.9లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముద్దనూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ నగదును సీజ్ చేశారు. నగదుకు సంబంధించిన పత్రాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర





ప్రత్యేక వాహనంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, పాదయాత్రలో జెడ్పీ చైర్మన్

ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : రాజంపేట వాల్మీకి సంఘం నాయకులు శనివారం 16వ తిరుమల మహాపాదయాత్ర ప్రారంభించారు. స్థానిక బోయపాళెం వద్ద నుంచి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లబోతుల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత బోయపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్ర పటానికి, అలాగే ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పూజలు చేసి జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్‌లు పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు దండు గోపీ, మిరియాల సురేఖ, పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి వేణుగోపాల్‌రెడ్డి, దాసరి పెంచలయ్య, పేరకం శంకరశెట్టి, వాల్మీక సంఘం నాయకులు మండ్ల శంకరయ్య, ఎన్.మణి, ఎన్.నరసింహా, ఎన్.నాగరాజ, ఎం.శ్రీహరి, ఎం.ధర్మయ్య, ఎం. ఆదినారాయణ, కోదండ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

యువకుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన డిగ్రీ విద్యార్థి ఎస్.రామాంజులు

కలికిరి/గాలివీడు : అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన టీడీపీ బహిరంగ సమావేశానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన కలికిరి మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లాకు చెందిన వెంకటరమణ కుమారుడు ఎస్.రామాంజులు(22) గాలివీడు మండలం గోరాన్‌చెరువులో తన బంధువుల ఇంట్లో ఉంటూ రాయచోటిలో డిగ్రీ చదువుతున్నాడు. అక్కడి టీడీపీ నాయకుల బలవంతంతో తన మిత్రుడు, గోరాన్‌చెరువుకు చెందిన గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంలో శనివారం పీలేరులో జరిగిన టీడీపీ బహిరంగ సమావేశానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో పీలేరు నుంచి కలికిరి మీదుగా గాలివీడుకు వెళుతుండగా గుండ్లూరు సమీపంలో ఎదురుగా వచ్చిన పాల ట్యాంకర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో రామాంజులు, గణేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజులు మృతి చెందాడు. గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబు సభకు కూలీల తరలింపు



పీలేరు సభకు వెళ్లే బస్సు ఎక్కుతున్న కూలీలు

రాజంపేట : అన్నమయ్య జిల్లా పీలేరులో శనివారం నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు సభకు రాజంపేట నుంచి కూలీలను తరలించారు. ఆశావహులు పోటీపడి తమ బలప్రదర్శనకు గుత్తి కూలీలపై ఆధారపడటం కనిపించింది. ఫలితంగా రాజంపేట పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులకు అంతరాయం కలిగింది. ఇంటి నిర్మాణ యజమానులు ఇబ్బందులు పడ్డారు. కూలీలకు రూ.400 నగదు, బిర్యానీ ప్యాకెట్, ఏసీ బస్సులో పీలేరుకు తరలించడం బాహటంగానే కనిపించింది. ఇవే పరిస్థితులు సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో కనిపించాయి.

రాజంపేటలో నకిలీ పోలీసు అరెస్టు



నకిలీ పోలీసు వివరాలు వెల్లడిస్తున్న రాజంపేట టౌన్ సీఐ మద్దయ్య ఆచారి

రాజంపేట : రాజంపేట పట్టణంలో శనివారం బద్వేలుకు చెందిన మాడపూరు శివయ్య అనే నకిలీ కానిస్టేబుల్‌ను పట్టణ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విద్యానగర్‌కు వెళ్లే దారిలో ఇతను వాహనాలను ఆపి డబ్బులు వసూలు చేస్తున్నాడనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో పట్టణ ఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ పోలీసు యూనిఫాంలో ఉన్న నకిలీ పోలీసు స్థానిక పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు చాకచక్యంగా పట్టుకుని విచారించారు. పోలీసు శాఖతో అతనికి ఎలాంటి సంబంధం లేదని నిర్ధారణకు వచ్చారు. రాజంపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకున్నాడని విచారణలో తేలింది. పట్టణంలో అడపాదడపా ఖాకీ వేషంలో ప్రజలను మోసం చేస్తూ వచ్చాడు. శివయ్య నుంచి పోలీసు యూనిఫాం, పోలీసు డిపార్టుమెంట్‌కు సంబంధించిన ఫేక్ ఐడీ , వాకీటాకీ, చార్జర్, నేమ్‌ప్లేట్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మద్దయ్య ఆచారి విలేకరులకు వెల్లడించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

నవశకం

నెరవేరిన సొంతింటి కల



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు సమీపంలోని చౌడమ్మ వీధిలో మేము అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాము. గత కొన్నేళ్లుగా ఇంటి కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగనన్న కాలనీల పేరుతో ఊర్లు నిర్మిస్తున్నారు. అందులో మాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఘంటశాల ఇంద్ర, పులివెందుల

కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు



నాడు–నేడు ద్వారా మోడల్ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వం పాఠశాలను నాడు–నేడు కింద మొదటి విడతలో ఎంపిక చేసింది. దీంతో పాఠశాలలో అభివృద్ధి పనులు విరివిగా చేపట్టారు. అలాగే బాలికల హాస్టల్‌కు, పాఠశాలకు ప్రహరీ నిర్మించారు. తరగతి గదుల్లో విద్యార్థుల కోసం కొత్తగా బెంచీలు ఏర్పాటు చేశారు. ఆర్‌ఓ ప్లాంటు ద్వారా విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులు చాలా సంతోషంగా పాఠశాలకు వస్తున్నారు. పాఠశాలలో వంట గది వద్ద భోజన నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా పనులు చేశారు.

– రామాంజులు నాయక్, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ పాఠశాల, పెద్దమండ్యం

సులభంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలంటే నానా కష్టాలు పడాల్సి వచ్చేది. మీసేవలో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయం, మీసేవ చుట్టూ తిరిగినా సమయానికి అందేవి కావు. పిల్లలకు చాలా ఇబ్బందులు ఉండేవి. అయితే జగనన్న సురక్ష పథకంతో అవసరమైన ధ్రువపత్రాలు గ్రామ వలంటీర్ ద్వారా ఒక్కరోజులోనే అందించారు. పథకాలు ఇంత సులభతరం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– కె. కాంతమ్మ, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం.

చింతచెట్టుపై నుంచి పడి రైతు మృతి

తంబళ్లపల్లె : చింతచెట్టు నుంచి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన శనివారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు పరసతోపు పంచాయతీ కొండకింద మేకలవారిపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి(82), తన పొలంలోని చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా కుటుంబీకులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించార. చికిత్స పొందేలోపే మృతి చెందాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో శనివారం జరిగింది. మండలంలోని నావాబుకోటకు చెందిన ఈశ్వరరెడ్డి(31) కుటుంబ సమస్యల కారణంగా విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రూయాకు తీసుకెళ్లారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె : అల్లరిమూకల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు... పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన సయ్యద్ చాంద్‌బాషా(60) చిల్లర దుకాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 25వ తేదీ రాత్రి ఇద్దరు యువకులు అంగడిలో సరుకులు తీసుకున్నారు. అనంతరం రూ.10లకు రెండు ఐదు రూపాయల నాణేలు ఇవ్వాలని దుకాణ యజమాని సయ్యద్ చాంద్‌బాషాతో గొడవపడ్డారు. అతను చిల్లర లేదని తెలపడంతో దాడి చేశారు. దాడిలో గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఇంతియాజ్‌బాషా ఫిర్యాదు మేరకు దాడి కేసును హత్యకేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నందలూరు(రాజంపేట) : బహుదానది (చెయ్యేరు) వద్ద రాజంపేట మండలం, దిగువ మందపల్లి గ్రామానికి చెందిన కొండూరు సుబ్బరాజు మద్యం బాటిళ్లు అధిక ధరలకు విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ జహీర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించి కొండూరు సుబ్బరాజు వద్ద 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బరాయుడు, పోలీసులు మహేంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు పట్టివేత



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న

సిద్దవటం : సిద్దవటం ఎగువపేటకు చెందిన కె. రాజన్న 15 మద్యం బాటిళ్లు అక్రమంగా కలిగి ఉండటంతో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఒక వ్యక్తి 3 మద్యం బాటిళ్లకు మించి తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాబయ్య, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, కానిస్టేబుల్ రామకుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన జంభానం మహబుబ్ బాషా (45) అనే వ్యక్తి జమ్మలమడుగు పట్టణం చౌడేశ్వరి ఆలయం వెనుక వైపున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్‌ఐ మురళీ యాదవ్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. జంభానం మహబుబ్ బాషా బేల్దారి పనులు చేసుకొని జీవించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం భార్య గౌస్‌బీ అనారోగ్యంతో మృతి చెందింది. కొన్ని నెలల తర్వాత గౌస్‌బీ సోదరుడు కుల్లాయిబాషా తన చెల్లెలుకు చెందిన ఇద్దరు పిల్లలను, సామగ్రిని తీసుకెళ్లాడు. అనంతరం మహబుబ్‌బాషా పేరుతో ఉన్న ఇంటిని పిల్లల పేరు మీద రాసి ఇవ్వాలని కుల్లాయిబాషా అడిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మహబూబ్ బాషా బేల్దారి పని మీద జమ్మలమడుగు పట్టణానికి వచ్చాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. శనివారం చౌడేశ్వరి ఆలయం వెనుక మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కడప నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. మృతుడి తల్లి జమాల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో కడప మార్కెట్‌యార్డు సెక్రటరీ మృతి



బాలవెంకటరెడ్డి (ఫైల్)

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్‌యార్డు సెక్రటరీ పాలకొలను బాల వెంకటరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కడపలో నివాసం ఉన్నప్పటికి జనవరి 26వ తేదీ రిపబ్లిక్‌డే సెలవు కావడంతో తమ సొంత గ్రామమైన కలసపాడు మండలం సిద్దమూర్తిపల్లెకు వెళ్లారు. ఈయన కడప మార్కెట్‌యార్డులో దాదాపు రెండేళ్ల నుంచి సెక్రటరీగా పనిచేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం తెల్లవారుజామున అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం పోరుమామిళ్లకు తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ట్రాఫిక్ అవస్థలు



రాజంపేట : లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో శనివారం ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పీలేరులో టీడీపీ సభకు వెళుతున్న ఆ పార్టీ నాయకుల వాహనాలు పట్టణంలో ప్రధాన రహదారి, ఆర్‌ఎస్ రోడ్డు, పాతబస్టాండు సర్కిల్, ఆర్వోబీ, బ్రహ్మణపల్లె వరకు ఇష్టానుసారంగా ట్రాఫిక్ నిబంధనలు అధిగమించి నడిపించారు. దీంతో రాజంపేట–రాయచోటి రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ట్రాఫిక్ సమస్యపై స్థానికులు పెదవి విరిచారు. సమాచారం తెలుసుకున్న రాజంపేట అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నూతన నిర్మాణాల కోసం రాయచోటి కోర్టు తరలింపు



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్ : రాయచోటిలో ప్రస్తుతమున్న కోర్టు భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించనుండటంతో కోర్టును పట్టణంలోని ప్రైవేట్ భవనంలోకి మార్చుతున్నట్లు న్యాయమూర్తులు తెలిపారు. ఈ భవనాలు 1984 సంవత్సరంలో నిర్మించారు. వాటి శ్లాబ్ పెచ్చులూడుతున్నాయయి. 15 ఏళ్ల క్రితమే వీటికి మరమ్మతులు చేశారు. అయినా ఫలితం లేదు. దీంతో వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని రోడ్డు, భవనాల అధికారులు సూచించారు. ఈ విషయాలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా వారు నూతన భవనాల నిర్మాణానికి అనుమతించారు. శనివారం ఉదయం నుంచి కోర్టు కార్యాలయాలను తరలిస్తున్నట్లు జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి తెలిపారు. ఈమేరకు ఆయన న్యాయవాదులతో సమావేశమయ్యారు.

మాచుపల్లిలో వ్యవసాయ ప్రదర్శన



వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో శనివారం ఏరువాక కేంద్రం, ఊటుకూరు, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతికి చెందిన 23 మంది ఫైనలియర్ అగ్రికల్చర్ విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వరి, వేరుశనగ, మినుము, నువ్వులు లాంటి పంటలలో మేలైన రకాలు, పురుగులు, తెగుళ్లు, కలుపు యాజమాన్యం వంటి అంశాలలో సమస్యల గురించి గ్రామస్తులు, శాస్త్రవేత్తలతో చర్చించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తిరుపతి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్‌రెడ్డి, ఏరువాక కేంద్రం ఊటుకూరు కోఆర్డినేటర్ డాక్టర్ టి. మురళికృష్ణ, ఊటుకూరు కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. వీరయ్య, ఊటుకూరు ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. జాన్సన్, బద్వేల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజ, ఊటుకూరు ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్రీవల్లి, శ్రీ వెంకటేశ్వర వ్యసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.శైలజ, ఏరువాక కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రామలక్ష్మిదేవి, మాచుపల్లి సర్పంచ్ ఎం. భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన అవసరం

శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్



మాట్లాడుతున్న స్వర్ణప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ప్రజా వినియోగిత సేవల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులకు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందిస్తామన్నారు. 9963731698 నంబర్‌కు ఫోన్ చేసి చట్టంపై అవగాహన పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి, కరస్పాండెంట్ ఫాదర్ ఆరోగ్యస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యుడు ఎంపీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.